


విద్యుత్ పొదుపును పాటించండి

ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యుత్ పొదుపును పాటించి భావితరాలకు వెలుగునిద్దామని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఇందన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో వివేకానంద విగ్రహం నుండి గాంధీ సర్కిల్ వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతాయుతంగా ఇంటింటా కరెంటు పొదుపు చేయడం ద్వారా ఊరురా వెలుగు ఏర్పడుతుందని, నిరంతర విద్యుత్ పొదుపు భావితరాలకు వెలుగునిస్తుందన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హైరోడ్ భూములకు పరిహారం/టీడీఆర్..

- ఏది ఉత్తమమో అదే చేస్తాం..
- సీఎం దృష్టికి తీసుకెళ్లి.. ప్రత్యేక ప్యాకేజీ తెచ్చేలా కృషి చేస్తాం
- కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల వెల్లడి



నగరాభివృద్ధి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో రోడ్ల విస్తరణ సందర్భంగా పూర్తిగా స్థలాలను నష్టపోయే బాధితులకు పూర్తి భరోసా ఇస్తామని, ప్రభుత్వం నుంచి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్పష్టం చేశారు. నగరంలో హై రోడ్డు, గిరింపేట రోడ్ల విస్తరణకు సంబంధించి.. సంబంధిత యజమానులు, హై రోడ్డు అసోసియేషన్, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నేతలు, యువత, కాలనీ అసోసియేషన్లతో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అధ్యక్షతన ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సంయుక్త కలెక్టర్ విద్యాధరి, మేయర్ ఎస్.అముద, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఇన్చార్జి కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, చుడా చైర్ పర్సన్ కె.హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా రోడ్డు విస్తరణ సందర్భంగా స్థలాలను నష్టపోతున్న బాధితుల అభిప్రాయాలు, వినతులను కలెక్టర్, ఎమ్మెల్యే విన్నారు. బాధితులు తెలిపిన సందేహాలను, అపోహలను, భయాందోళనలపై ఎమ్మెల్యే అప్పటికప్పుడే సమాధానాలు చెప్పి వారికి భరోసా ఇచ్చారు,

కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల విస్తరణలో ప్రధానంగా ఒకటి స్థలాలు, జీవనోపాధి కోల్పోవడం, మరొకటి పరిహారం ఏ రూపంలో ఇవ్వాలనే రెండు అంశాలు ఉన్నాయని వీటిపై స్పష్టత ఇస్తామన్నారు. చిత్తూరు చుట్టూ జాతీయ రహదారులు, ఎక్స్ప్రెస్ హైవేల నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ పరిస్థితుల్లో చిత్తూరు నగరంలో రోడ్లు విస్తరణ చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు లేకపోవడం వల్ల అభివృద్ధిలో వెనకబడే అవకాశం ఉన్నందున... వీటిని అధిగమించేందుకు ప్రజల సహకరించాలన్నారు. జిల్లాలో జరుగుతున్న హైవేల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చామనే విషయాన్ని గుర్తు చేశారు. ఇదే తరహాలో రోడ్డు విస్తరణలో బాధితులకు పరిహారం ఏ విధంగా ఇవ్వాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. టీడీఆర్ బాండ్లపై అపోహలు వద్దని ఇటీవల రోడ్ల విస్తరణ చేపట్టిన చాలా నగరాల్లో ఈ విధానాన్ని అమలు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో 100 అడుగుల రోడ్డు విస్తరణ జరిగితే భూముల విలువ పెరుగుతుందని, వ్యాపార అవకాశాలు పెరిగి అభివృద్ధి వేగంగా పుంజుకొని ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎక్కడా ఎవరి దగ్గర నుంచి బలవంతంగా భూములు లాక్కుంటామని ఆందోళన వద్దని, నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రోడ్ల విస్తరణలో పూర్తిగా ఇల్లు కోల్పోయే వారికి టిడ్కో తరహా గృహాలు నిర్మించేందుకు కలెక్టర్‌తో కలిసి చర్చించి బాధితులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్డీవో శ్రీనివాసులు, ఎంహెచ్ డాక్టర్ లోకేష్, వేము ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్, హైరోడ్ అసోసియేషన్ సభ్యులు, సంతపేట డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిష్యత్ ఉపాధ్యాయులకు ఊతం డీఎస్సీ శిక్షణ

కుప్పంలో మొదటి రోజు నారా భువనేశ్వరి పర్యటన



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ అధినేత నారా భువనేశ్వరీ కుప్పం పర్యటన గురువారం మొదటిరోజు విజయవంతంగా కొనసాగింది. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులతో కలిసి ఉదయం పీఈఎస్ వైద్యకళాశాల ప్రాంగణంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని, త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలో బాబు స్వగృహ నిర్మాణాన్ని పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అక్కడి నుండి కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతులలో ఉందని, యువత సన్మార్గన్ని అవలంభిస్తూ, సాంకేతికతను అందిపుచ్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఆధునిక సమాజంలో ప్రతి రంగంలోనూ మహిళలు దూసుకుపోవడం హర్షించదగ్గ విషయమన్నారు. నాడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న బాబు యువతకు ఐటీ రంగాన్ని అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందని, నేడు ఐటి రంగంలో మహిళలు సైతం దూసుకుపోవడం చూస్తుంటే భవిష్యత్తులో ఆడవారే అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కుప్పం పట్టణంలోని నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున సమాజ శ్రేయస్సుకు, పేదప్రజల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధిలో కుప్పాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలుపుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని సైతం పర్యవేక్షించారు. భవిష్యత్తు ఉపాధ్యాయులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఊతం ఇస్తోందన్నారు, అన్ని అర్హతలు ఉండి డీఎస్సీ శిక్షణ పొందలేని పేద విద్యార్థుల సౌకర్యార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున డీఎస్సీ శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సమాజంలో నిరుద్యోగ నిర్మూలనకు సైతం ట్రస్ట్ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ట్రస్ట్ తరుపున విద్య వైద్య రంగాలలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.

నారా భువనేశ్వరి పర్యటన స్థలాల పరిశీలన

రామకుప్పం: నారా భువనేశ్వరి 21వతేది శనివారం రామకుప్పం మండలంలో పర్యటించనున్న స్థలాలను టిడిపి నేతలు పర్యవేక్షించారు. కేంచనబల్ల పంచాయతీ గాంధీనగర్, మనేంద్రం పంచాయతీ కృష్ణరాజపురం గ్రామం, విజలాపురంలోని కస్తూరిబా హాస్టల్లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అమరావతితో చర్చించారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, చిన్నకృష్ణ, చలపతి పాల్గొన్నారు.

ద్రమ్ములో శవం కేసులో

సిఐ హనుమంతప్ప టీమ్‌కు ఏబీసీడీ అవార్డు

ప్రతిష్టాత్మకంగా 48 గంటలలోపే...



అవార్డును అందుకుంటున్న కార్వేటినగరం సీఐ హనుమంతప్ప

ప్రజాశక్తి- కార్వేటినగరం: డ్రమ్ములో శవం కేసులో ఉత్తమ పనితీరును కనపరిచిన పోలీస్ అధికారులకు విజయవాడలో డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డును డీజీపీ ద్వారక తిరుమలరావు చేతుల మీదుగా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కార్వేటినగరం సీఐ హనుమంతప్పకి, సీఐడీ మస్తాన్వలి, హెడ్ కానిస్టేబుల్ వై లక్ష్మీ ప్రసన్నకి, కానిస్టేబుళ్లు ఎన్.ఆగస్టిన్, డీ.మల్లికార్జున, హోంగార్డు గోవర్ధన్ సింగ్కు ఆవార్డులు అందజేశారు. జూలై 28వ తేదీన డ్రమ్ములో గుర్తుతెలియని శవం ఆస్పరి మండల పరిధిలోని చిన్నహూతూరు గ్రామంలో బయట పడింది. డీజీపీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సీఐ హనుమంతప్ప టీం ఈ కేసులో ఎలాంటి చిన్న క్లూ లేకపోయినప్పటికీ 48 గంటలలో కేసును ఛేదించడం, వారంలోపే నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు పంపించడం జరిగింది. ఈ కేసు పురోగతిలో ఉత్తమ పనితీరును కనబరిచిన సీఐ హనుమంతప్ప టీముకు రాష్ట్ర డీజీపీ, కర్నూలు జిల్లా ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి ఆస్పరి మండల ప్రజలంతా కృత్ఞతలు తెలియజేసినట్లు సీఐ హనుమంతప్ప ఫోన్ ద్వారా మాట్లాడుతూ తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ కేసు విషయంలో నిద్రలేని రాత్రులు గడిపానని, మన తీరును పై అధికారులు గుర్తిస్తారని అనడానికి ఈ కేసు ఒక నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన ఏబీసీడీ అవార్డుతో తనకు ఇంకా బాధ్యత పెరిగిందని, ప్రజలకు సేవలు అందించడంలో ఎల్లవేళలా విధినిర్వహణలో అప్రమత్తంగా ఉంటానని తెలిపారు. ఈ అవార్డు ఇచ్చిన తన పైస్థాయి అధికారులు అందరికీ తనకు సహకరించిన పోలీసు సిబ్బందికి, ప్రతి విషయంలో తనకు సహకారం అందించిన ఆస్పరి మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

ఇంచార్జ్ డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్దేశించిన పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యే విధంగా సిబ్బంది కృషిచేయాలని ఇంచార్జ్ డిఆర్డిఏ పీడీ శ్రీదేవి ఆదేశించారు. గురువారం చిత్తూరులోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో జిల్లాలోని 18 మండలాలకు చెందిన డిఆర్‌డిఏ వెలుగు సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం డిఆర్డిఏ ద్వారా అనేక పథకాలను చేపట్టిందన్నారు. ఈ పథకాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లి గ్రామీణ పేదలకు చేరువ అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని, ఆరోగ్యం, సంపద సంతోషమే లక్ష్యంగా ఈ డాక్యుమెంట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. స్వయం సహాయ సంఘాల్లో సంఘానికి ఒకరైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆశయమని తెలిపారు. కావున సంఘాల్లో అర్హత కలిగిన మహిళలను చైతన్యవంతులు చేయాలన్నారు. తద్వారా సమాజం ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నారు. అయితే పరిశ్రమ స్థాపన విషయంలో ముందుచూపు అవసరం అన్నారు. స్థానికంగా ఉన్న వనరులు మార్కెటింగ్ పరిశ్రమల స్థాపన పై అవగాహన ఉండేవారిని ఎంపిక చేయాలన్నారు. కేవలం రుణాలతో సరిపెట్టుకోకుండా రికవరీ పైన కూడా దృష్టి పెట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలు సాంకేతికను అందిపుచ్చుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆన్‌లైన్ డీజిలేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సంఘాల్లో ఆర్థిక లావాదేవీల విషయంలో ఎక్కడ పొరపాటు లేకుండా చూడాలన్నారు. ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ కేటాయించిన విధులు బాధ్యతలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. చిత్తూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అన్నిరంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కిందిస్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈసమావేశంలో ఏపిడి రవికుమార్ డిపిఎంలు వెంకటేష్, రవి, ఏపీఎం సుబ్బారెడ్డి, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి

కమిటీ సమావేశం ఏర్పాటు చేయండి

నూతన పీడీకి సిఐటియు వినతి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని గురువారం కలెక్టరేట్లో నూతన ఐసిడిఎస్ పీడీకి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి విజయ, ఉపాధ్యక్షురాలు మమత మాట్లాడుతూ గతంలో అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం 42రోజులు పాటు సమ్మె చేయడం జరిగిందని, సమ్మె జరిగి సంవత్సరం పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూవిటీ అమలు చేయాలని, సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కారాలకు రూ.20వేలు, వారి కుటుంబంలోని వారికి ఉద్యోగం ఇవ్వాలని, హెల్పర్లకు ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించాలని, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులనే పదాన్ని తొలగించాలని, అంగన్వాడీ సెంటర్ ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని తదితర సమస్యలతో పాటు సమ్మెలో ఉన్న సమస్యలను పరిష్కారం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. అలాగే జిల్లాలో అనేక ప్రాజెక్టులలో అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాటి పరిష్కారం కోసం వెంటనే జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మినీ అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం మెయిన్ సెంటర్‌గా మారుస్తామని ప్రతిపాదనలు పంపాలని జిల్లాలో అధికారులకు తెలిపారని అయితే కొన్నిచోట్ల అధికారులు బెదిరించి భయపెట్టే పని చేస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని ప్రాజెక్టుల్లో బకాయి వేతనాలు కూడా ఉన్నాయని వాటిని ఇవ్వాలని కోరారు.

అమిత్‌షా వ్యాఖ్యలు ఖండిస్తూ నిరసన

అమిత్ షా వ్యాఖ్యలపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపశిల్పి అయిన డాక్టర్ అంబేద్కర్ గురించి అమిత్ షా ఈవ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. దీనితో ఆయన మనువాద దృక్పథాన్ని బయటపెట్టారని, అమిత్‌షాకు హోంమంత్రిగా కొనసాగే హక్కు లేదని సిపిఎం భావిస్తున్నదని తెలిపారు. ఇటువంటి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులు, మేధావులు, లౌకిక, సామాజిక వాదులు సంఘాలు నిరసనలు తెలియజేయాల్సిందిగా కోరారు.



నగరిలో నిరసన

విజయపురం (నగరి): పార్లమెంట్లో జరిగిన శీతాకాల సమావేశంలో భారత రాజ్యాంగం మీద జరిగిన చర్చలో కేంద్ర హోం మంత్రి అమీత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అమీత్ షా రాజీనామా చేయాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కార్యదర్శి ఎంకె.ప్రకాష్, సంఘ జాతీయ అధ్యక్షులు డి.గోవిందస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలకు యావత్తూ భారతదేశం వ్యతిరేకిస్తోందన్నారు. మనుధర్మ భావజాలాన్ని పార్లమెంట్లో మాట్లాడడం సబబు కాదన్నారు. ఆయన ఉద్దేశపూర్వకంగానే అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడారన్నారు. వెంటనే ఆయన్ని అరెస్ట్ చేయాలని అంతవరకు దేశంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయని హెచ్చరించారు. సంఘ నగరి మండల గౌరవ అధ్యక్షులు బాలవర్ధన్ రాజు, అధ్యక్షులు విజయ్ చందర్, ఉపాధ్యక్షులు మైల్ స్వామి, బాబు, ప్రధాన కార్యదర్శి తంగరాజు, కార్యదర్శి యోవాన్, కోశాధికారులు రజిని, కొల్లాపూరి, అలెక్స్, సభ్యులు సందీప్, సేటు, శివ, హరి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు పర్యవేక్షణ



ప్రజాశక్తి- పూతలపట్టు: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు అవసరమైన ప్రత్యేక పరికరాల కోసం పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాలలో గుర్తించిన లబ్ధిదారులకు రానున్న మూడు నెలల్లో సహాయ పరికరాలు పంపిణీకి చేయడం జరుగుతుంది. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల 462 మంది శిబిరానికి రాగా అందులో 390 మంది అర్హులు కాగా 72 మంది ఇప్పటికే పరికరాలు పొందారని గుర్తించడం జరిగిందని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కె. మురళీమోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శిబిరాల్లో చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ళ చేతి కర్రలు, నాలుగు కాళ్ళ చేతి కర్రలు, వాకర్స్, చంక కర్రలు, వీల్ చైర్లు, చెవి వెనుక ధరించే వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్ళు, రోలోటర్స్, ఎంఎస్.కిట్స్, అంధుల చేతి వాచ్, అంధుల చేతి కర్రలు, టచ్ ఫోన్, వాయిస్ ఫోన్, ఎల్ బోక్రచస్, బారైన కుష్టు వ్యాధి గ్రస్తులకులో ప్రేసి కిట్లు, డైసి ప్లేయర్, ఎంఎస్ఐడి కిట్స్, స్మార్ట్ కెన్ కృత్రిమ అవయాలు వివిధ ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీఆర్డీఏపి డిబి.శ్రీదేవి, ఆర్డీఓ శ్రీనివాసులు తహశీల్దార్ గుర్రప్ప, ఈఓపిఆర్డీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుర్తింపు శిబిరం: మున్సిపల్ కమిషనర్

విజయపురం (నగరి): దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయ జీవన పరికరాలు పంపిణీ కొరకు జిల్లా పరిపాలనా యంత్రాంగం చిత్తూరు వారి సహకారంతో భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ప్రత్యేక గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆవశ్యకతను గుర్తించేందుకు 20వ తేదీ శుక్రవారం ఉదయం 8.30గంటలకు పట్టణ పరిధిలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. గుర్తించిన వారికి కిట్స్ అందిస్తామన్నారు. శిబిరానికి విచ్చేసే వారు యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో ఫోన్ నెంబరు నమోదు చేసి తీసుకురావడంతో పాటు నాలుగు ఫోటోలు అందించాలన్నారు. వయోవృద్ధులకు యూడీఐడీ కార్డు అవసరం లేదన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


పరిశ్రమల ఏర్పాటు ద్వారా

ఉపాధి అవకాశాల పెంపు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు భూమి కేటాయింపు ప్రక్రియకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన కొరకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు భూమి కేటాయింపు ప్రక్రియను సంబంధిత శాఖలు సమన్వయంతో త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఈ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో 55 భారీ పరిశ్రమల ఏర్పాటుతో 18,219 మందికి ఉపాధి అవకాశాలు, 34,700 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా 1,38,800 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. మరో మూడు భారీ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 2024 ఏప్రిల్ నుండి ఇప్పటివరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 975 అప్లికేషన్స్ అందగా నిర్ణీత గడువు లోపల 943 పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రానికి 71 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించగా లక్ష్యాన్ని అధికమించి 114 యూనిట్లు గ్రౌండ్ చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన వారికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించే అంశంపై క్షేత్రస్థాయిలో మరింత అవగాహన తీసుకుని రావాలని ఈ పథకంపై అవగాహన పెంచడం మరింత అవసరమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిని ఆదేశించారు. పారిశ్రామికవాడ గంద్రాజుపల్లిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేలో ఇప్పటివరకు 9459 ఎంఎస్ఎంఏ యూనిట్లు సర్వే చేయడం జరిగిందని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో సర్వే చేపట్టడం జరుగుతున్నదని పరిశ్రమల శాఖ ఏడి కలెక్టర్ కు వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ వెంకట్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ సుబ్బారావు, ఎల్‌డిఎం హరీష్ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్ గోవర్ధన్ బాబి పాల్గొన్నారు.

'అపోలో'లో విజయవంతంగా

షోల్డర్ రీప్లేస్మెంట్ సర్జరీలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ప్రజాశక్తి- తవణంపల్లి: అధునాతన వైద్యంతో భుజం మార్పిడి శస్త్రచికిత్సలను అరగొండ అపోలో ఆసుపత్రి యాజమాన్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. గురువారం అరగొండ అపోలో ఆసుపత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, షోల్డర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ సమ్మి, కార్తీక్ రెడ్డిలు మాట్లాడుతూ మొదటగా చెన్నై అపోలో ఆసుపత్రిలో భుజం మార్పిడి శస్త్ర చికిత్సలకు శ్రీకారం చుట్టగా వంద శాతం విజయవంతమైందన్నారు. అలాగే అరగొండ అపోలో ఆసుపత్రిలో కూడా అత్యాధునిక పద్ధతిలో భుజం మార్పిడి శస్త్రచికిత్స విధానం ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఆధునాతన వైద్యం ద్వారా భుజం మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తే నొప్పి శాతం చాలా తక్కువగా ఉంటుందని, రోగి కేవలం ఆరు వారంలోనే కోలుకుంటారని తెలిపారు. దీర్ఘకాలికంగా భుజం నొప్పి అధికంగా ఉన్నవారు సాధారణ శస్త్రచికిత్సల ద్వారా నయం చేయలేని, ఎముకలు పగుళ్ల ఉన్నవారు, భుజం ఆపరేషన్లు విఫలమైన వారికి ఈ అత్యాధునిక వైద్యవిధానం ద్వారా శస్త్రచికిత్సలు చేయడం ద్వారా 100శాతం ఫలితం ఉందని వెల్లడించారు. ఇతర ఆసుపత్రులలో చికిత్స చేయించుకుంటే రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని, అపోలో ఆసుపత్రిలో చేసుకుంటే కేవలం రూ.3 లక్షలతోనే భుజం మార్పిడి శస్త్రచికిస్తత చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, అపోలో ఆసుపత్రి పిఆర్ఓ కమ్రుద్దీన్, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

కూలీల కొరతతో.. యంత్రాల వైపు..

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

వరి కోతల సమయంలో కూలీల కొరత, అధిక ఖర్చులు, సమయం వృథా అవుతుండడంతో రైతులంతా పంటను ఒబిడి చేసుకునేందుకు యంత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఖర్చుతోపాటు సమయం కూడా ఆదా అవుతుందని, ధాన్యాన్ని నేరుగా మార్కెట్‌కు తరలించేందుకు అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే యంత్రాలు వినియోగించే సమయంలో రైతులు, యజమానులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుంది. అందుకే వరి కోతల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



తీసుకోవల్సిన జాగ్రత్తలు..

వరి పైరు నుంచి మరో వరి పైరుకు వెళ్లేందుకు ముందుగా వరిపైరు హద్దుల్లో కత్తిరించుకోవాలి దారి తీస్తే యంత్రం సులువుగా వెళ్తుంది. దీంతో ఒడ్లు పాడవ్వవు. పూర్తిగా భూమి ఎండిన తర్వాత వరి కోస్తే సమయం ఆదా అవుతుంది. ఒడ్డు, గట్టు చుట్టూ ఉన్న వరి పంటను చేతితో కోయటం వల్ల ఎకరాకు దాదాపు పదినిషాల సమయం కలిసి వస్తుంది. పచ్చిగా ఉన్న వరి కోయడం వల్ల సమయం ఎక్కువగా పడుతుంది. అలాగే ఒడ్లు కూడా మట్టిలో కలిసిపోయే అవకాశం ఉంటుంది. పొలంలో రాళ్లు ఉండే చోటును ముందుగానే యంత్రం నడిపే వాళ్లకు తెలపాలని గుర్తిస్తే కోత సమయంలో మెషిన్ బ్లేడ్ విరిగి నష్టం వాటిల్లకుండా ఉంటుంది. వరి పంటను కోత కోస్తున్న చెయిన్ మెషిన్ విద్యుత్ స్తంభాలకు చాలా దూరం నుంచే హార్వెస్టర్ను వెళ్లనివ్వాలి. వరి పంట నేలకు ఆనుకున్న సమయం కూలీల చేత కోత కోయించాలి. ఒడ్లు నిల్వ ఉంచుకునే రైతులు పంటను కోసిన వెంటనే తేమ లేని ప్రదేశంలో వడ్లు ఆరబోసి తూర్పువార బట్టి తర్వాత నిల్వ చేసుకోవాలి. వాతావరణంలో మార్పులు ఉన్న సమయంలో కోతలు కోయకుండా ఉండటమే మంచిది. నేల, వరి గింజల్లో తేమ లేదని భావిస్తే మాత్రమే మెషిన్ కోత కోయించాలి. తేమ ఉన్న సమయంలో గానీ, వర్ష వచ్చే సూచనలు ఉన్నప్పుడు కోతలు కోస్తే గింజల్లో తేమశాతం ఉండి. వరి గింజలు బూజుపట్టి పాడైపోతాయి.

ఆర్థిక భారం తగ్గుతుంది..

ఎకరా వరి పంటను కూలీలతో కోయాలంటే సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యంత్రాలతో కోస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. సరైన సమయంలో ఒడ్లు గింజలు ఇంటికి చేరుతాయి. దీంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వరి కోత యంత్రాలు రావడంతో కోతలు చాలా సులభతరం అయ్యాయి. ఒక ఎకరా వరి పంటను గంటలో కోసి వరి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకుంటున్నారు రైతులు.

పంట దిగుబడిని కాపాడుకోవాలి

- చిట్టిబాబు, వ్యవసాయాధికారి

యంత్రాలతో వరి కోత సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వరి పంట కోసిన తర్వాత తేమ తగ్గేందుకు అనువైన ప్రదేశంలో ధాన్యం ఆరబెట్టాలి. అయితే ధాన్యంలో తేమ ఒక్కసారిగా తగ్గకుండా క్రమక్రమంగా తగ్గాలి. ఇందుకోసం రైతులు సాధారణ ఎండలోనే ధాన్యం ఆరబెట్టాలి. పంట దిగుబడిని కాపాడుకోవాలి.



గోకులం షెడ్లు తనిఖీ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లి సచివాలయ పరిధిలోని చవనపల్లి గ్రామంలో గోకులం షెడ్లు నిర్మాణాలను గురువారం జిల్లా అధికారులు తనిఖీ చేశారు. గ్రామంలోని రైతు దామోదర్ రెడ్డి ఇంటి ఆవరణలో నిర్మిస్తున్న గోకులం షెడ్డును ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు ఎన్ని షెడ్లు నిర్మాణం పూర్తి అయ్యాయి, ఎన్ని నిర్మాణదశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సునీల్, జిల్లా నీటి యాజమాన్యసంస్థ అధికారి రవి కుమార్, ఏపీఓ, ఎన్ఆర్ఐజీఎస్ ఏతం పాల్గొన్నారు.

అడిషనల్ డీఎం హెచ్ఓ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సదుం: మండల పరిధిలోని సదుం ప్రభుత్వ కమ్యూనిటీ సెంటర్, నడిగడ్డ విలేజ్ హెల్త్ క్లినిక్, చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చిత్తూరు జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సదుం సిహెచ్‌సిలో నిర్వహిస్తున్న ల్యాబ్ పరీక్షలు, వైద్యుల విధులు, సిబ్బంది విధులపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్ప కుమారిని అడిగి తెలుసుకున్నారు. నడిగడ్డలో నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న వైద్య సౌకర్యాలపై ఎంఎల్‌హెచ్‌పి మనీషా, ఏఎన్ఎం సుజాతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. వైద్య సిబ్బంది హాజరు, పనితీరుపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీషాను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న ల్యాబ్ పరీక్షలు, లెప్రసీ, టిబి తదితర పరీక్షలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. డాక్టర్ ఇ.పుష్ప కుమారి, డాక్టర్ రూపానంద్, డాక్టర్ గిరీషా, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉదయ్ భాస్కర్, ఎంఎల్ హెచ్‌పి మనీషా, ల్యాబ్ టెక్నీషియన్ గీత, టిబి సూపర్‌వైజర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయండి

ఎంపీడీవో చంద్రమౌళి

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరం పంచాయతీ పద్మసరస్సు వద్దనున్న జగనన్న కాలనీని ఎంపీడీవో టి.చంద్రమౌళి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. త్వరగా పూర్తిచేస్తే బిల్లులను వెంటనే మీ అకౌంట్లో వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల గురించే ఇళ్లను మంజూరు చేసిందని త్వరగా నిర్మించుకోవాలని కోరారు. సంక్రాంతి లోపల పూర్తి చేయాలని ఆయన లబ్ధిదారులకు తెలిపారు.

డియూ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో

సాంస్కృతిక కార్యక్రమం

ప్రజాశక్తి - కుప్పం టౌన్: గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో గురువారం డియు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ద్రావిడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ముఖ్యంగా యువతలో దాగివున్న కళలను వెలికి తీయాలన్న ఉద్దేశంతో ద్రావిడ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ క్లబ్ వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ముఖ్యంగా యువత ప్రస్తుత కాలంలో వివిధ అసాంఘిక కార్యకలాపాలకు వారి ఆలోచనలను మళ్లిస్తూ వారి జీవితాన్ని ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారని, అలాంటివారిని ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారిలో ఉన్నటువంటి ప్రతిభను వెలికితేస్తూ వారి ఆశయాలకు బాటలు వేసే విధంగా ఓ చిన్నపాటి సందేశాన్ని వారికి అందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందాన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, డియు స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి

స్థలం మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- యాదమరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని గురువారం తహశీల్దార్ పార్థసారథికి జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకొని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుమార్, ఎస్సీ సెల్ నాయకులు మురుగేష్, జార్జి, సుతేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం ఆరోగ్య కేంద్రం పరిధిలోని మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు హెల్త్ ఎడ్యుకేటర్ కాంతం విద్యార్థులకు సీజన్ వ్యాధులపట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసీజన్లో నీటి వలన, దోమ కాటు వలన ఎక్కువగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా వంటి జర్వాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఆహారం తినే ముందు చేతులను సబ్బుతో చేసుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మార్క్, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్ శాంతమ్మ పాల్గొన్నారు.

సోలార్‌తో తగ్గనున్న విద్యుత్ భారం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): సోలార్ వాడకంతో విద్యుత్ భారం తగ్గుతుందని ట్రాన్స్‌కో డీఈ సురేష్ కుమార్ తెలిపారు. గురువారం నగరి పట్టణంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏజేఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సూర్యయోజన పథకం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోలార్ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రతి గృహానికి సోలార్ అమర్చుకోవాలని దానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ సదుపాయం కల్పిస్తుందన్నారు. ఏడీఈలు వెంకట ముని, లోకనాథరావు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన బోధనా పద్ధతులతో

పౌరుల సర్వతోముఖాభివృద్ధి : ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్లో విద్యాప్రమాణాలను మరింత మెరుగు పరచాలన్న ఉన్నత లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నత విద్యకు పెద్దపీట వేసే దిశగా ముందుకు సాగుతోందని టిడిపి పార్లమెంటు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా అధ్యాపకుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వారిని మరింత చైతన్యం పరచి అధునాతన బోధనా ప్రమాణాలతో పౌరుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని అన్నారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి, హక్కులు, ప్రయోజనాలను సాధించడంలో భాగంగా ఇప్పటికే పలు శాఖలకు సంబంధించిన వివరాలను కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసి, సంబంధిత శాఖల నుంచి సమాధాలను రాబట్టడంలో సఫలీకృతులయ్యారు. ఆంధ్రప్రదేశ్లో మూడు ఉన్నత విద్యాసంస్థల్లో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ఆన్లైన్‌లో ఉందని, 27 ఉన్నత విద్యాసంస్థల్లో 432 మంది అధ్యాపకులు శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే 33 హయర్ ఎడ్యుకేషనల్ సంస్థల్లో 370 మంది అధ్యాపకులు శిక్షణ పొందినట్లు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఆర్‌జిఎస్‌ఎ కార్యాచరణ ప్రణాళిక, ఆధునికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై కార్యక్రమంలో భాగంగా గురువారం రెండోరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డి శారదాదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 2030 సంవత్సరంలోపు మౌలిక సదుపాయాల రూపకల్పనకు 9 రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, ఏఈ హేమలత, ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద, ఏపిఎం మీరాబాయి, సిహెచ్ఓ కరుణాకర్, వెలుగు ఏపిఎం మీరాబాయి, సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఏపిఎం రవి అన్నారు. గురువారం మండల కార్యాలయంలో సర్పంచులు పంచాయతీ కార్యదర్శి శిక్షణా కార్యక్రమం రెండో రోజు ఇన్చార్జి ఈఓపిఆర్డి గణపతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీల అభివృద్ధికి పనులు చేయాలని, ప్రతి సర్పంచ్ పంచాయతీ కార్యదర్శులు పోటీతత్వంతో పనులు చేపట్టి సమస్యలు లేని పంచాయతీలుగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, ఏపీఓ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రెడ్డి కళ్యాణి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: రెండు రోజులపాటు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శి శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. చెత్త నుంచి సంపద తయారీపై ఈటిసి ట్రైనింగ్ సెంటర్ నాగ పద్మాజ అవగాహన కల్పించారు. పంచాయతీలో విధులు నిధుల వినియోగం పై పంచాయతీ కార్యదర్శులకు సూచన, సలహాలు ఇచ్చారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిలు, పరిశీలనా విధానం, వీధి లైటింగ్, పంచాయతీలలో ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర అంశాలపై పూర్తిగా వివరించారు ఎంపిడిఒ రమణప్రసాద్, పిఒపిఆర్డి రాజేంద్రన్, పంచాయతీ కార్యదర్శులు ఏఐఎంలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ కుమ్మరి శాలివాహన కమ్యూనిటీ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.15 కోట్లు విడుదల చేసింది. ఈ సందర్భంగా కుమ్మరి శాలివాహన సాధికార సమితి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో కుప్పం పట్టణానికి చెందిన కుమ్మరి కులస్తులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేలుస్తూ, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. వారు మాట్లాడుతూ కమ్యూనిటీ భవన నిర్మాణంతో పాటు కుండల తయారీ ప్రాంత ప్రహరీగోడ నిర్మాణానికి సైతం రూ.40లక్షలు మంజూరు అయినట్టు తెలిపారు. టిడిపి నాయకులు గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, ముఖేష్, కృష్ణ పాల్గొన్నారు.

రేపు జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శాంతిపురం: మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని శాంతిపురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి కోరారు. శనివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం వద్ద కుప్పం ఇంచార్జ్ భరత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రతిభ చాటిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థినులు



ప్రజాశక్తి- కుప్పం టౌన్: ఈనెల 17, 18వ తేదీలలో పలమనేరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2024లో కుప్పం పట్టణానికి చెందిన డాక్టర్ వైసి.జేమ్స్ మెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ చాటినట్టు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థిని కుమారి ఇ.నిహారిక 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారని, అదేవిధంగా 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ విభాగపు విద్యార్థిని కుమారి పి. స్ఫూర్తి ద్వితీయ స్థానం పొంది, ప్రత్యేక ప్రశంసాలు బహుమతిని సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్. సుబ్బన్న, కంప్యూటర్ విభాగాధిపతి పి.శ్రీనివాసులు, ఇన్చార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జిఎన్.రమేష్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు క్రీడాకారులను అభినందించారు.

అంతర్జాతీయ పోటీల్లో మొదటి స్థానం పీఈఎస్ స్కూల్ విద్యార్థిని



చిత్తూరు టౌన్: ఢిల్లీ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్జాతీయ యుసిఎంఎస్ అబాకస్ పోటీల్లో పిఎస్ స్కూల్ విద్యార్థిని మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు. పిఈఎస్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్న షబ్నం హాజీ అంతర్జాతీయ పోటీల్లో మొదటి స్థానం సంపాదించి తమ స్కూల్‌కి గొప్ప పేరు తీసుకొచ్చిందని తెలిపారు. అలాగే విద్యార్థిని తల్లిదండ్రులు సయ్యద్ ఫాజిలుద్దీన్ తన కూతురు అంతర్జాతీయ పోటీల్లో మొదటి స్థానం సంపాదించడం గర్వంగా ఉందని అన్నారు.

ఘనంగా చల్లా బాబు జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి- సోమల: పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ చల్లా బాబు జన్మదిన వేడుకలను మండలంలోని అన్ని పంచాయతీలలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, మాజీ సర్పంచులు హరిప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, పీఎం మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు నాగభూషణం రాయల్, చినబాబు పాల్గొన్నారు.

రొంపిచర్ల: చల్లా రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం అభిమానుల మధ్య రొంపిచర్లలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. చల్లా బాబుకు మహిళలు హారతులు ఇస్తూ ఆహ్వానించారు, అభిమానులు భారీ క్రేన్లతో గజమాలలతో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అభిమానుల మధ్య భారీ కట్ చేసి పంచిపెట్టారు.

దుప్పట్లు పంపిణీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు అండగా ఉంటానని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ, మెప్మా సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న కట్టమంచిలోని నిరాశ్రయుల వసతి గృహంలో ముందస్తు క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ఈఎంసి ఫౌండేషన్, ఆత్మకూరు, నెల్లూరు జిల్లా ప్రతినిధి ఎడ్వర్డ్ సహకారంతో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జ్ ఎంఎస్. భారతి విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ నిరాశ్రయులకు ఈఎంసి ఫౌండేషన్ ప్రతినిధి ఎడ్వర్డ్ దుప్పట్లు ఇవ్వడం చాలా అభినందనీయమని అన్నారు. నిరాశ్రయులకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని, వారికి అవసరమైన వసతులు, ఆర్థికపరమైన అంశాలు ఏమైనా ఉంటే కలెక్టర్‌తో మాట్లాడి సహకరిస్తానని తెలియజేశారు. సపోర్ట్ సంస్థ అధ్యక్షులు జోసెఫ్ రాజు, సిబ్బంది ప్రమీల, ఇంద్రాణ, సుందరాజన్, విమల పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పాల వ్యాను ఢీకొని చిన్నారి మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పాల వ్యాను ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని చిల్లగుండ్లపల్లిలో చోటు చేసుకున్నది. ఏఎస్ఐ మల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. చిల్లగుండ్లపల్లి గ్రామానికి చెందిన ధరణి బాబు కుమార్తె నేత్ర (3) వీధిలో ఆట్లాడుకుంటూ ఉండగా అతివేగంగా వచ్చిన పాలవ్యాను ఢీకొంది. ఈ సంఘటనలో పాపకి తలకు బలమైన గాయం కావడంతో సిఎంసికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



నేత్ర (ఫైల్ ఫొటో)

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు – కర్నూలు జాతీయ రహదారిలోని రంగంపేట క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన గురువారం పూతలపట్టు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తలుపులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సిద్ధయ్య శెట్టి గురువారం ఎంఆర్‌సి నుంచి ద్విచక్ర వాహనంపై సోషల్ ప్రశ్నాపత్రాలను ఇదే మార్గంలో ఉన్న రంగంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఇవ్వడానికి రోడ్డు దాటుతుండగా వెనుక వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరులోని సీఎంసికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సిద్ధయ్య శెట్టి (ఫైల్ ఫొటో)

అనాలోచిత నిర్ణయాలను పునఃసమీక్షించాలి

విజయపురం (నగరి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనాలోచిత నిర్ణయాలను పునఃసమీక్షించాలని ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మణిగండన్, అసోసియేట్ అధ్యక్షులు మునిరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నాపత్రాలు తీసుకెళుతూ తలపులపల్లి ఉపాధ్యాయుడు సిద్ధయ్యశెట్టి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమన్నారు. ఇలాంటి నిర్ణయాలు అసంబద్ధమని విజ్ఞప్తి చేసినా అధికారులలో మార్పు రాలేదన్నారు. ఇప్పటికైనా అనాలోచిత నిర్ణయాలను పునఃసమీక్ష చేసి ఉపాధ్యాయులకు చదువుచెప్పే వాతావరణం కల్పించాలన్నారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కార దిశగా రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బల్ల గ్రామపంచాయతీలో తహశీల్దార్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కాలం వృథా చేయకుండా తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ, ఆర్ఐ నారాయణ, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు అనూహ్య స్పందన లభించింది ప్రజల నుంచి 90 అర్జీలు వచ్చాయి. తహశీల్దార్ బెన్ను రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు సచివాలయ పరిధిలోని ప్రజలు రైతులు భారీగా తరలివచ్చారు. పలు రకాల భూ సమస్యలపై ఇంటి పట్టాలు కావాలంటూ జర్నలిస్టులకు ఇంటి పట్టాలు అందజేయాలంటూ పలువురు దరఖాస్తులను అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై ఇస్తున్న అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీటీసీ సావిత్రమ్మ, పీఎం మల్లికార్జున, అడుసుపల్లి సుబ్రహ్మణ్యం, జనార్ధన్, వీఆర్వో సురేష్, రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

సదుం: తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్‌ను బూరగమంద ఎంపీటీసీ మల్లికార్జున, బూరగమంద సర్పంచ్ వెంకట రమణ గురువారం బూరగ మందలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్ ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను సన్మానించినట్లు తెలిపారు.

పెద్దపంజాణి: మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటి తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. గురువారం తుర్లపల్లె పంచాయతీ సచివాలయ పరిధిలో డిటి రమేష్ బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. పంచాయతీ రైతులు తమ భూసమస్యలపై ఎక్కువగా అన్నదమ్ముల భాగపరిష్కారాలు, ముటేషన్లు, పై అధికారులకు అర్జీలు అందజేశారు. రైతులు దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. సర్వేయర్ సిరాజ్ నాయక్, వీఆర్వో సుబ్రహ్మణ్యం ఆచారి, దేవాదాయశాఖ అధికారులు వీరకుమార్, ఎస్‌వి జగదీష్, వీఆర్వోలు ఉమా శంకర్, రాజన్న, శంకర, కవిత, గీత, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని 170 గొల్లపల్లిలో రెవెన్యూ సదస్సు తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై గ్రామాల్లోని గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. సమస్యలున్న రైతులు తమ దృష్టికి తేవాలని తెలిపారు. అలాగే భూములకు బాగా పరిష్కారాలు నూతన పట్టా, పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి మంజూరు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఆర్ఐ మధుసూదన్, మండల సర్వే లావణ్య, ఎంపిటిసి గోమతి, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

అరగొండలో రైతు సదస్సు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలో చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో అరగొండ గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన, సదస్సు అందరినీ అకట్టుకుంటుంది. డాక్టర్ ఎంవి.రమణ, తిరుపతి ఎస్‌వి కళాశాల డిఎంఓ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ డివి.సుమతి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ చిత్తూరు సభాధ్యక్షులు డాక్టర్ బి.సంధ్యారాణి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డివై రెడ్డి రాము, ఆచార్యులు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్ పాల్గొన్నారు. టెర్రస్ షర్మింగ్, హైడ్రోపోనిక్స్ మల్చింగ్ డ్రోన్ల వినియోగం, సమీకృత వ్యవసాయ పద్ధతులు అడవి పందుల నుండి పంటలను కాపాడుకోవడంట, బిందు తుంపర సేద్యంపై వివిధ రకాల మోడల్స్ ద్వారా అవగాహన కల్పించారు.